
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 25.9, కనిష్ఠం 21.0



ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా అజ్మతుల్లా హుస్సేనీ

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించింది. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జిగా రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఇన్‌చార్జిలంతా జిల్లాలకు వెళ్లి సమావేశం నిర్వహించాలని పార్టీ ఆదేశించింది.



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

మహిళా పోలీసు సిబ్బందికి శిక్షణ

- ప్రారంభించిన పోలీసు కమిషనర్ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు మహిళా సిబ్బందికి సీపీ సాయిచైతన్య ఆధ్వర్యంలో వినూత్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళలు తెలుసుకోవాల్సిన స్కిల్స్, టెక్నిక్, జాగ్రత్తలు, మహిళలకు తమపై తమకు ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతీ మహిళా సిబ్బంది తప్పకుండా డ్రైవింగ్, స్విమ్మింగ్ నేర్చుకోవాలని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అన్ని రకాల మెలకువలను నేర్చుకొని తర్ఫీదు పొందే విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మహిళలు నిరసన కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రతీ మహిళా సిబ్బంది ఏ విధంగా తమ విధులు నిర్వహించాలో, ఏ విధంగా వారిని తరలించాలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారం రోజుల పాటు వివిధ రకాల పద్ధతులను తెలుసుకోవాలన్నారు. ఈ శిక్షణను ప్రభుత్వ స్కూళ్లలో పీఈటీలు, పీడీలుగా ఉన్న రెజ్లింగ్, జూడో కోచ్‌ల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ రాంచందర్‌రావు, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు సతీష్, శేఖర్‌బాబు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



శిక్షణను పరిశీలిస్తున్న సీపీ, ఇతర పోలీసు అధికారులు





- దూపల్లి గేట్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

రక్తమోడుతున్న రహదారులు!

- జిల్లా మీదుగా మూడు జాతీయ రహదారులు
- తరచూ ప్రమాదాలతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- బ్లాక్ స్పాట్లను గుర్తించినా.. తగ్గని ప్రమాదాలు
- అతివేగంతోపాటు హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు
- జిల్లా వ్యాప్తంగా ఆరు నెలల్లో 377 రోడ్డు ప్రమాదాలు.. 161 మంది మృతి

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రహదారులు రక్తమోడుతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా మీదుగా మూడు జాతీయ రహదారులు వెళ్తుండగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు గాయాలపాలవుతున్నారు. అతివేగంతోపాటు హెల్మెట్ ధరించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా మృతి చెందుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ముఖ్యంగా యువత వేగంగా వెళ్తూ వాహనాలను నియంత్రించలేక ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతోనే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నా అనేక మంది వాటిని పట్టించుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు నెలల్లో 377 రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. అందులో 161 మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలను కోల్పోగా 386 మంది గాయాలపాలయ్యారు. తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించినప్పటికీ ప్రమాదాలను మాత్రం నియంత్రించలేక పోతున్నారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సుదీర్ఘంగా చర్చించారు. బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అయినప్పటికీ ప్రమాదాలు మాత్రం నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

హైవేలపైనే ప్రమాదాలు ఎక్కువ..

జిల్లా వెంట 44, 63, 3వ నెంబర్ జాతీయ రహదారులు వెళ్తున్నాయి. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారుల వెంట వెళ్తుండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ ప్రమాదాలు జాతీయ రహదారులపైనే జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ జాతీయ రహదారులలో 40 బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. జాతీయ రహదారుల వెంట వాహనాల వేగం ఎక్కువగా ఉంటుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారుల వెంట ఉన్న గ్రామాల ప్రజలకు వాహనాలను జాతీయ రహదారిపై ఏ విధంగా నడపాలో తెలియక యూటర్న్‌లు తీసుకోకుండా రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో జాతీయ రహదారుల వెంట ఉన్న దాబాలు, హోటళ్లలో మద్యం విక్రయాలు జరుగుతుండటంతో వాహనదారులు మద్యం తాగి వాహనాలను ఇష్టారీతిన నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు కూడా జరుగుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. పనులను త్వరగా పూర్తి చేస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చని అధికారులు చెబుతున్నారు.

అతివేగం.. నిర్లక్ష్యమే కారణం..

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అధికంగా అతివేగం, నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. వేగంగా వాహనాలను నడుపుతూ తొందరగా ఇంటికి చేరాలనే ఆలోచనతో చాలా మంది ప్రాణాలను తీసుకుంటున్నారు. ఎక్కువ శాతం మంది మాత్రం నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. ద్విచక్ర వాహనదారులైతే హెల్మెట్‌లు ధరించకపోవడంతోనే ఎక్కువ మంది ప్రాణాలను కోల్పోతున్నారు. కార్లు, ఇతర వాహనాలు నడిపేవారు సీట్‌బెల్ట్‌ను ధరించడం లేదు.

నియంత్రణ ఎలా..

రోడ్డు ప్రమాదాల వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న ఘటనలు నిత్యం జిల్లాలో పదుల సంఖ్యలో నమోదు అవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల బారిన పడి అమాయకపు యువకులు ప్రాణాలను కోల్పోతున్నారు. అనేక మంది క్షతగాత్రులు అవుతూ కుటుంబాలకు భారంగా మారుతున్నారు. రోడ్డు భద్రతకు సంబంధించి అనేక నిబంధనలు అమల్లో ఉన్నా వాహనదారులు వాటిని పట్టించుకోవడం లేదు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అదే విధంగా కారు, ఇతర వాహనాలు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలనే నిబంధనలు ఉన్నా వాటిని పట్టించుకోవడం లేదు. ప్రమాదాల నివారణకు జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించి భద్రత చర్యలు కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జాతీయ రహదారుల వెంట మద్యం దుకాణాలను నియంత్రించడం, దాబాల్లో, హోటళ్లలో మద్యం విక్రయాలను బంద్ చేయించడం ద్వారా కొంత వరకు రోడ్డు ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉంటుంది.

వన మహోత్సవానికి సర్వం సిద్ధం

- ఎక్సైజ్ శాఖ లక్ష్యం 88వేల మొక్కలు

సుభాష్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవానికి ఎక్సైజ్ శాఖ సర్వం సిద్ధం చేసింది. ప్రభుత్వం వన మహోత్సవాన్ని ఆదివారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించింది. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం అధికారికంగా ప్రారంభం కాగానే మొక్కలు నాటడానికి సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే జిల్లా యంత్రాంగం ఎక్సైజ్ శాఖకు 88 వేల ఈత, ఖర్జూర మొక్కలను నాటేందుకు టార్గెట్ నిర్ణయించింది. జిల్లాలోని వివిధ స్టేషన్ల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి వాటిలో కొన్నింటిని మిగతా వాటిని ప్రైవేటు స్థలంలో మొక్కలను నాటేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీంగల్, మోర్తాడ్ స్టేషన్ల పరిధిలో 88వేల ఈత, ఖర్జూరం మొక్కలను నాటనున్నారు. నిజామాబాద్, ఆర్మూర్ స్టేషన్‌ల పరిధిలో అత్యధికంగా 20వేల చొప్పున ఈత, ఖర్జూర మొక్కలను నాటనున్నారు. భీంగల్ స్టేషన్ పరిధిలో 18 వేలు, బోధన్, మోర్తాడ్ స్టేషన్‌ల పరిధిలో 15వేల మొక్కలను నాటనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- ఇందల్వాయిలో సొంత భవనాలు కరువు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

సోయా.. గయా!

- పంట ఆరంభంలోనే పట్టి పీడిస్తున్న వైరస్
- పత్తాలేని వ్యవసాయ అధికారులు

7



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

పండగ వాతావరణంలో ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలు నిర్వహించాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఈనెల 10వ తేదీ నుంచి 16 వరకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలను జిల్లాలో పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన జిల్లా సమైక్య సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. విజయోత్సవ సంబరాల గురించి చేపడుతున్న చర్యలపై డీఆర్‌డీవో సాయాగౌడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 8వ తేదీన అన్ని మండలాల్లో సన్నద్ధత, కార్యాచరణ సమావేశాలు, 9వ తేదీన గ్రామసంఘాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు విజయోత్సవ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొనేలా చూడాలన్నారు. అర్హత కలిగిన సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ నిర్మాణంలో ఉన్న జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను సందర్శించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల ఈవీఎం గోదాంను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన చేశారు. ఈవీఎం గోదాంకు వేసిన సీల్‌లను పరిశీలించారు. ఈవీఎం గోదాం వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఆయన వెంట కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం సిబ్బంది కార్తిక్, విజయేందర్ తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద కూతురుతో వృద్ధురాలు వెంకటలక్ష్మి

ఆస్తులు రాయించుకొని ఇంట్లో నుంచి గెంటేశారు

- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన వృద్ధురాలు వెంకటలక్ష్మి

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకు రెండు సంవత్సరాల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లగా అతని కుమారులు.. నాన్నమ్మ, తాతయ్యల పేరిట ఉన్న ఆస్తిని రాయించుకొని నాన్నమ్మను ఇంట్లో నుంచి బయటకు గెంటేసిన మానవీయ ఘటన నిజామాబాద్ జిల్లాలో జరిగింది. నవీపేట మండలం గాంధీనగర్‌కు చెందిన మేడగం వెంకటలక్ష్మి 80 ఏళ్ల వృద్ధురాలు తనకు న్యాయం చేయాలని సోమవారం తన కూతురుతో కలిసి వీల్‌చైర్‌లో నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చింది. తన భర్త బాల నాగిరెడ్డి చనిపోయాడని, తన పెద్ద కుమారుడు రెండు సంవత్సరాల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లగా అతని కుమారులు రమేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు పెన్షన్ ఇప్పిస్తామని చెప్పి తనతో సంతకాలు చేయించుకొన్నారని తెలిపింది. ఇళ్లు, ఏడు ఎకరాల పొలాన్ని వారి పేరు మీదకు మార్చుకొని తమను ఇంట్లో నుంచి గెంటేశారని వృద్ధురాలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. బ్యాంకు బుక్కు, ఆధార్‌కార్డు, పాస్‌బుక్కులు బలవంతంగా లాక్కొని తమ పేరు మీద రాయించుకున్నారని అదేంటని అడిగితే పెట్రోల్ పోసి తగలబెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వృద్ధురాలు తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా సివిల్ మ్యాటర్ అయినందు వల్ల కోర్టులో తేల్చుకోవాలని చెబుతున్నారని బాధితురాలు వాపోయింది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆర్‌డీవో ద్వారా సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తనకు న్యాయం చేయాలని తన ఆస్తి తన పేరుమీదకు రాయాలని బాధితురాలు కోరింది.

10న 'దిశ' సమావేశం

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరగనున్న ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు కోచైర్మన్‌గా సురేష్ షెట్కార్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చైర్మన్‌గా ఈ సమావేశం జరగనుంది. సమావేశానికి హాజరుకావాలని ఇప్పటికే అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ సంఘటితంగా కదలాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణకు మెమెంటోను అందజేస్తున్న విద్యార్థులు

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

వర్ని, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సంఘటితంగా కదిలితే బ్రహ్మాండమైన భారతదేశాన్ని నిర్మించుకోవచ్చని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో మల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు చదువు ఒక్కటే సంస్కారం కాదని విద్యతో పాటు సంస్కారం, వినయంను తల్లిదండ్రులు అలవర్చాలని సూచించారు. అమ్మా, నాన్నలు మమ్మల్ని చూసి గర్వపడాలి అని పిల్లలు అనుకుంటే.. మా పిల్లలు గర్వపడేలా మేం చూడాలని తల్లిదండ్రులు చూడాలని కోరారు. పిల్లలకు ప్రతి విషయంపై అవగాహన కల్పిస్తూ వారిలో మంచి ప్రవర్తన, మంచి నడవడికను అలవర్చడంలో గురువులు, తల్లిదండ్రులు ముందుండాలని కోరారు. క్రైమ్ సమాచారాలకు పిల్లలను దూరంగా ఉంచడం తల్లిదండ్రుల కర్తవ్యంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో విక్టరీ మోడల్ ప్రిన్సిపాల్ రాంచందర్, శ్రీసాయి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మధు, వివేకా ప్రిన్సిపాల్ నగేష్, విజయ స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు ఏసీపీ శ్రీనివాస్, ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

వివేకానంద స్ఫూర్తిని అలవర్చుకోవాలి..

కోటగిరి: వివేకానంద స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో సోమవారం స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేశారు. శ్రీరామకృష్ణ సేవా సమితి ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవీంద్రనాథ్ ఠాగూర్, వివేకానంద సాహిత్యం చదివితే భారత దేశాన్ని చూసినట్లని అమెరికా మహాసభలో సోదరి, సోదరిమణులారా అని సంబోధించి ప్రపంచానికి అందరు ఒక కుటుంబం అని చెప్పిన మహా వ్యక్తి వివేకానందుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు శివ శ్రీనివాస్, హన్మంత రావు, రజిని, నాగశ్రీ, రవిచంద్ర, నితిన్ చంద్ర పాల్గొన్నారు.

మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శోభారాణి

ఆర్మూర్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ రకాల శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో సోమవారం నిర్వహించిన మల్టీపర్పస్, హెల్త్ వర్కర్, ట్రైనింగ్ క్యాపింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థులకు క్యాపింగ్ చేశారు. వివిధ కోర్సులు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం శోభారాణి మాట్లాడుతూ.. ఎన్‌టీ రామరావు ప్రారంభించిన మహిళా ప్రాంగణాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ హయాంలో మరుగున పడేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళా ప్రాంగణాలు మళ్లీ వెలుగులోకి వచ్చాయన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ ప్రాంతంలోని నిరుపేద మహిళలకు తమకాళ్లపై తాము నిలబడడానికి స్టాఫ్ నర్సులుగా, వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 40 మంది శిక్షణ పొందాలని శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం డబ్బు కోసం కాకుండా మానవత్వంతో సేవలందించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 60వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. రాజీవ్ యువవికాస్ పథకంలో మగవారితో సమానంగా మహిళలకు డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామని, డ్రైవింగ్ నేర్చుకున్న వారికి ఎలక్ట్రిక్ ఆటోల కొనుగోలుకు రుణాలు ఇస్తామన్నారు. కార్పొరేషన్ ద్వారా శిక్షణ తీసుకుంటే సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, డబ్ల్యూసీ డీసీ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, ప్రాంగణం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో

ఆర్మూర్‌రూరల్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. సోమవారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో బూత్‌స్థాయి అధికారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరి పేరును ఓటర్ జాబితాలో నమోదు చేయాలన్నారు. అదే విధంగా మృతి చెందిన వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించాలని, ఇతర ప్రాంతాల్లో వెళ్లి నివసిస్తున్న వారి పేర్లు తొలగించి వారు నివాసం ఉన్నచోటనే ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఒకే వ్యక్తికి రెండుచోట్ల ఓటు ఉండకుండా చూడాల్సిన బాధ్యత బూత్‌స్థాయి అధికారులపై ఉందన్నారు. సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో రాజగంగారాం, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చిరుత సంచరించిన ప్రాంతాల పరిశీలన



మిట్టాపూర్‌లో చిరుత సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్ గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తున్న ప్రాంతాన్ని సోమవారం అటవీశాఖ బీట్ ఆఫీసర్లు సుధీర్, రాజేందర్‌లు పరిశీలించారు. ఆదివారం సాయంత్రం మిట్టాపూర్ శివారులో మేకల మందపై చిరుత పులి దాడి చేసి ఒక మేకను తీవ్రంగా గాయపర్చిన విషయం విదితమే. చిరుత పులి సంచారంపై వారు గ్రామస్థుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిరుత పులి సంచారం పట్ల మేకల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని బీట్ ఆఫీసర్లు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్‌రూరల్,జూలై7(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మంగళవారం అభివృద్ధి పనులలో భాగంగా సబ్ స్టేషన్ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని టౌన్ ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, దుర్గానగర్, కొత్తబస్టాండ్, సరస్వతి నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి రెండు రోజుల జైలు

రెంజల్,జూలై7(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆదివారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడపడంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపిస్తున్న ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష న్యాయమూర్తి విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మద్యం తాగిన వారిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి వారికి రెండు రోజుల జైలుశిక్ష విధించారన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయని, ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

అంగన్‌వాడీలను పటిష్ఠం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్

బోధన్‌రూరల్,జూలై7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను పటిష్ఠం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ అన్నారు. సోమవారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్నా రవి, సీనియర్ నాయకులు అల్లె రమేష్, తమ్మి శంకర్, ఈరాయప్ప శివ కుమార్, అశోక్, మాధవరావు, పీరాజి, అంగన్‌వాడీ టీచర్ లావణ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సుదర్శన్, గ్రామపెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్లు వ్యాన్ బోల్తా

● ముగ్గురికి గాయాలు

నవీపేట,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ శివారులో సోమవారం ఉదయం కల్లు వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వ్యాన్ టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడగా వ్యాన్‌లో ఉన్న డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయని స్థానికులు వివరించారు. వెంటనే బాధితులను మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో కల్లు సీసాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ విషయంపై ఎస్ఐ వినయ్‌ని వివరణ కోరగా ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.



యంచలో బోల్తా పడిన కల్లు వ్యాన్

హత్య కేసులో తల్లీ కొడుకు రిమాండ్

బోధన్‌రూరల్,జూలై7(ఆంధ్రజ్యోతి):బోధన్ మండలం మిరాన్‌పల్లి గ్రామంలో దారావత్ దేశ్యానాయక్ హత్యకు గురి కాగా దారుణహత్యకు పాల్పడిన భార్య సాలుబాయిని, కొడుకు వసంత్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మినార్‌పల్లి గ్రామంలో దారావత్ దేశ్యానాయక్‌ను దారుణంగా హత్య చేసిన అతని భార్య, కొడుకును అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.పూర్తి విచారణ అనంతరం తల్లితో పాటు తనయుడిని సైతం విచారించగా అసలు విషయాలు బయటకు వచ్చాయని ఆయన వెల్లడించారు. సోమవారం సాయంత్రం కోర్టుకు రిమాండ్ చేశామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

వేల్పూర్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం లక్కోర గ్రామ శివారులో సోమవారం ఉదయం సుమారు ఐదు గంటల సమయంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తి జీన్స్‌ప్యాంట్, బ్లూ షర్టు, రెడ్ బనియన్ ధరించి ఉన్నాడు. మృతుడి తల తెగి పడడంతో వ్యక్తి ఎవరు అనేది స్థానికులు గుర్తు పట్టలేకపోతున్నట్లు తెలిసింది.

కేటీఆర్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

● రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

వేల్పూర్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 18 నెలల్లో నుంచి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కేటీఆర్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం వేల్పూర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత పది సంవత్సరాలలో బీఆర్ఎస్ హయాంలో జరగలేని అభివృద్ధి పనులు పద్దెనిమిది నెలల్లోనే కొనసాగుతున్నాయని ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. పద్దెనిమిది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేస్తుందో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ మాట్లాడడం హాస్యస్పదంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఉంటు డ్రగ్స్ వ్యవహారంలో ఉండే కేటీఆర్‌కు గ్రామాల్లో జరిగే అభివృద్ధి ఏమి తెలియదని గ్రామాలలో తిరుగుతు ప్రజలను తెలుసుకోవాలే తప్ప, బుద్ది జ్ఞానం ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి పై అసత్యపు, తప్పుడు మాటలు మాట్లాడడం మానుకోవాలని లేదంటే ఊరుకునేది లేదని మానాల హెచ్చరించారు. గతటీఆర్ఎస్ పాలనలో ఎక్కడ కూడా పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వలేదన్నారు. ఎన్నికల కంటే ముందు రేవంత్‌రెడ్డి ప్రతీ నియోజకవర్గంలో పాదయాత్ర చేసినప్పుడు ఇళ్లు లేని పేదల బాధలు ఆయన విన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతీ నియోజకవర్గంలో మూడువేల ఐదు వందలు ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. వేల్పూర్ మండలానికి సుమారు నాలుగువందలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. పేదలకు తమకు సొంత ఇళ్లు ఉండాలన్న కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఇళ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వం నిదులు మంజూరు చేస్తు నిర్మాణ పనుల్లో వేగవంతం అయ్యే విధంగా అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటి సభ్యులు తమ ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా లబ్ధిదారులకు అన్నివిధాల సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజల కోసం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయం కేటాయిస్తు వారికి దగ్గరవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసే ప్రక్రియలో ఎక్కడ కూడా పార్టీ విభేదాలు, తమ, మన బేదాలు చూడాకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకే ఇవ్వడం జరిగిందన్నారు. గత పదేళ్ల క్రితం, అలాగే ప్రస్తుతం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ నరేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దామోదర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేష్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటి సభ్యులురమణ,రాజేందర్,కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించిన విద్యార్థినులకు సన్మానం

వేల్పూర్: వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించిన సహస్ర, స్వాతికలను సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి శాలువతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులు చదువులో భాగ రాణిస్తు మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఆ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు భూమారెడ్డి, కనక రవి, రమేష్, నరేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

మోస్రా,జూలై7(ఆంధ్రజ్యోతి): మోస్రా తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే మోస్రా గ్రామ శివారులోని సర్వే నంబర్ 952 ఫారెస్ట్ భూముల వివరాల కోసం రికార్డులను పరిశీలించారు. ఈ రికార్డుల ప్రకారం తహసీల్దార్‌తో వివరాలు తెలుసుకుని ఆ తర్వాత ఆ భూమి మొఖాపైకి వెళ్లి పరిశీలించాలని.. అలాగే భూ సమస్యలను పరిష్కారం చేసేందుకు పని చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఏ ఫైనల్ ఫలితాల్లో మచ్చర్ల గ్రామ యువకుడి అత్యుత్తమ ప్రతిభ

మెండోర , జూలై,7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా వారు విడుదల చేసిన సీఏ ఫైనల్ ఫలితాల్లో మెండోర గ్రామానికి చెందిన రైతు మచ్చర్ల రాజారెడ్డి కొడుకు రాజేందర్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా సీఏ రాజేందర్ రెడ్డి పదోతరగతి వరకు నిజామాబాద్ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. రాజేందర్‌రెడ్డి సీఏఫైనల్ ఉత్తీర్ణత సాధించడంపట్ల తల్లిదండ్రులు,బంధువులు, పలువురు, స్నేహితులు, గ్రామస్థులు అభినందించారు.



ఎమ్మార్పీఎస్ పతకాన్ని ఆవిష్కరించిన దృశ్యం



మెండోరాలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఆర్మూర్‌టౌన్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు 31వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నియోజకవర్గ ఇన్‌చార్జి మైలారం బాలు ఎమ్మార్పీఎస్ పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ మాదిగల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ సాధించడంతో పాటు ఆరోగ్యశ్రీ, వికలాంగుల, వితంతువుల వృద్దుల పెన్షన్ల పెంపుకోసం ఎమ్మార్పీ ఎస్ క్రియాల శీలక పాత్ర పోషించిందని 31 ఏళ్లుగా ప్రజా సమస్యల మీద ప్రభుత్వాలతో పోరాటం చేసి ఫలితాలను సాధించిందని అన్నారు. భవి ష్యత్తులో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయడానికి ఎమ్మార్పీఎస్ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందక్రిష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శ్యాం మాదిగ, సీనియర్ నాయ కులు ఇందరపు రాజు, మండల అధ్యక్షుడు రాము, సంతోష్, మంగళారం రవి, సంకెపల్లి విప్లవ్, కొక్కెర భూమన్న, రింగుల భూషన్, తెడ్డు నర్సయ్య, మల్కన్న, నల్ల రాజారాం, కృష్ణయ్య, పొన్నాల చంద్రశేఖర్, గణేష్, సుదర్శన్, రాజన్న, స్వామి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: బడుగు బలహీన వర్గాలకు అండగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పనిచేస్తుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మకురి మహేష్ మాదిత, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గుంటి నిశాంత్ మాదగలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాదిగ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మాదగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్న రిజర్వేషన్లను పంచుకోవ డమే కాకుండా రిజర్వేషన్లను పెంచుకోవడానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా భారత దేశంలో అన్ని రాష్ట్రాలలో ఎమ్మార్పీఎస్ ఏర్పాటు అయింది. దీనికంత కృషి చేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ వార్డు గ్రహిత మంద కృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైటప్‌:08బిఎన్‌పీ07: విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వసతి గృహంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. విద్యార్థులకు శీతల పానీయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరాం, భవాని లయన్స్ క్లబ్ సభ్యులు బర్ల మధు, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, సంజీవ్, నరేందర్ పాల్గొన్నారు.

మోస్రా: చందూరు మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆదేశాల మేరకు జెండా దిమ్మలు నిర్మించి జెండా విష్కరణ చేయడం జరిగిందని చందూర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దాకడి సాయిలు తెలిపారు. ఈ ఒక ఉద్యమం సుదీర్ఘ పోరాటం కొనసాగింది. జాతీయ నాయకుడు మందకృష్ణ మాదిగ కృషి పట్టుదల 30సంవత్సరాల పోరాట ఫలితమే ఈ ఎస్సీ వర్గీకరణ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సాయిలు, గ్రామ శాఖ అధ్యక్షుడు మోస్రా గంగారాం, ఆయా గ్రామాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎర్రోళ్ల యాదవ రావు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్‌ను స్థాపించడంతో పాటు 30సంవత్సరాల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బడుగు, బలహీన వర్గాల కోసం ఆరోగ్యశ్రీ, వికలాంగుల పింఛన్ ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా సాధించడం జరిగిందన్నారు. కోటగిరి మండల కేంద్రంలోనూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరాం, శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, నాయకులు పత్తి లక్ష్మణ్, బర్ల మధు,దావులయ్య, నితిన్, దినేష్, తరుణ్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శక్కర్‌నగర్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రం దళిత రత్న అవార్డు గ్రహీత మందుగుల విద్యాసాగర్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరావు, నాయకులు వీరపురం పోశెట్టి, సురేష్, మహేందర్, జేఏసీ శంకర్, కొత్తపల్లి రవీందర్, బండారి యాదగిరి, సాయిలు, మహేష్, మైనారిటీ రాష్ట్ర నాయకులు రజాక్, మేడి పాపన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు.

● **సాలూరలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

సాలూర మండల కేంద్రంలో సోమవారం దండోరా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ మాట్లాడుతూ గత 31సంవత్సరాల చరిత్రలో శాంతియుతంగా కొనసాగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు అల్లె రమేష్, శ్రీకాంత్ పటేల్, నాగరాజు, వెంకట్ పటేల్, ప్రజ్ఞశ్రీ రాజు, ముత్యం, ప్రకాష్, లింబూరి లక్ష్మణ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం రమేష్, సతీష్, జీవన్, చింతల సాయన్న, శేఖర్, రాములు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం కృషిన మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమ ప్రస్థానం ప్రారంభమై 31సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను కొలతల ప్రకారం నిర్మించాలి

వర్ని, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను నిర్దేశించిన కొలతల ప్రకారం నిర్మించాలని వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్లు స్పష్టంచేశారు. సోమవారం వర్ని మండలం మల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు.ప్రతి లబ్ధిదారుకు తక్షణమే బిల్లు మంజూరు కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరార

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

రుద్రూరు,జూలై7(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జి గాండ్ల మధు ఆధ్వర్యంలో సోమవారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ చేతుల మీదుగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి గాండ్ల మధు, దౌడ్ సాయిలు, నీరడి సాయిలు, ఆర్.పోశెట్టి, సాయాగౌడ్, శ్రావణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమావేశం

పెర్కిట్ , జూలై,7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం కాంప్లెక్స్ హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఈ విద్యాసంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నాణ్యమైన మధ్యాహ్న బోజనం, విద్యాపరమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాలు శ్రీనివాస్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

పంచాయతీ అనుమతి లేని ప్లాట్లు కొనొద్దు

ముప్కాల్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ గ్రామ పంచాయితీ అనుమతి లేని ప్లాట్లు కొనుగోలు చేయవద్దని కొత్తపల్లి గ్రామ పంచాయితీ సెక్రటరీ రాజు సోమవారం సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది. అనుమతులు లేకుండా వెంచర్‌లో ప్లాట్లు అమ్మకానికి పెట్టి రాజు సామాన్య ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.పంచాయితీకి ఎలాంటి సంబంధం లేదని ప్లాట్లు అమ్మిన, కొన్నవారిపై చట్టపరమైన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

కొడిచర్ల శివారులో ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,జూలై7(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొడిచర్ల మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున కొడిచర్ల మంజీర తీరం నుండి ఇసుకను ట్రాక్టర్లలో నింపి అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేసిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి సంబంధిత యాజమానులపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఎల్ఓ మీటింగ్ వాయిదా వేయాలి

రుద్రూరు,జూలై7(ఆంధ్రజ్యోతి): బీఎల్‌ఓలకు ట్రైనింగ్ మీటింగ్ జూలై 9న కాకుండా మరునటి రోజు నిర్వహించాలని బూత్ లెవెల్ ఆఫీసర్‌లు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రుద్రూరు డిప్యూటీ తహసీల్దార్ సురేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఉన్నందున సమ్మెలో పాల్గొననున్నట్లు నెల రోజుల క్రితం సంబంధిత అధికారికి సమ్మె నోటీసు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్, బీఎల్‌ఓలు పద్మ, ప్రతిమ, గంగామణి, రూప, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హాసాకొత్తూర్‌లో ఉచిత వైద్య శిబిరం

కమ్మర్‌పల్లి,జూలై,7(ఆంధ్రజ్యోతి):చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని హాసాకొత్తూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఈవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఏఎన్ఎంలుమమత, అమృత, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవతిగంగాధర్, నాయకులు,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రెంజల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ విద్యార్థులకు కీటక జనిత వ్యాధులు, పరిసరాల శుభ్రతపై ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్ కుమార్, రవీందర్‌లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ ప్రత్యేక అధికారి శ్యామల, ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ఆర్మూర్ టౌన్, జూలై,7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 14, 35 వార్డులలో సోమవారం మున్సిపల్ అధికారులు మహిళలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు.ఇంటింటికీ తిరుగుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడవద్దని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని, వీధి కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, సానిటరీఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు ఆఫీసర్లు శివకుమార్, నర్సయ్య, సానిటరీజవాన్లు, మెప్మాఆర్పీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జక్రాన్‌పల్లి , జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో వలస వచ్చి నివాసం ఉంటున్న లింగంపేట గ్రామానికి చెందిన కోరబోయిన అశోక్(32) అదృశ్యం కాగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు పోలీస్‌లు తెలిపారు. కోరబోయిన అశోక్ గతనెల 28న రాత్రి 9 గంటలకు జక్రాన్‌పల్లిలోని తన స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని చెప్పి బైక్ పై వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పోలీస్‌లు తెలిపారు. అదే రోజు అశోక్ అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు తెలిపారు. బైక్‌పై అర్గుల్ నుంచి డిచ్‌పల్లి వెళ్తుండా జక్రాన్‌పల్లి 44వ జాతీయ రహదారిపై బైక్ పై నుంచి కింద పడగా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం కోరబోయిన అశోక్ మృతిచెందినట్లు పోలీస్‌లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉప్లూర్‌లో సోయా పంట పరిశీలన

కమ్మర్‌పల్లి,జూలై 7 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ తదితర గ్రామాలలో ఇటీవల గడ్డి మందు చల్లడంతో మాడిపోయిన సోయా పంటను జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మర్‌పల్లిలోని ఎరువుల డీలర్ భూమేశ్వర్ దుకాణం నుంచి గడ్డి మందును కొనుగోలు చేసినట్లు ఆయన నిర్ధారించారు. ఈ మేరకు డీలర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. కాలం చెల్లిన క్రిమి సంహారక మందులను (కల్తీ మందులు) సీజ్ చేసి అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. కాగా శాంపిళ్లను సేకరించి టెస్టింగ్ నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంటల పరిశీలనలో బాధిత రైతులతో పాటు మండల వ్యవసాయాధికారిణి రమ్యశ్రీ, ఏఈవో రమేష్ ఉన్నారు.

'ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్మాణాన్ని తొలగించాం'

ఎల్లారెడ్డిరూరల్, జూలై 07(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఓ ఇంటి నిర్మాణాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకే తొలగించామని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాష్, మాల్కాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజార సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మారెడ్డితండాకు చెందిన కోల రాములునాయక్ ఆల్ ఇండియా బంజార సేవా సంఘం నూతన కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన



పాఠశాలలో షీటీం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెర్కిట్ , జూలై,7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో సోమవారం సైబర్ క్రైం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షీ టీం విఘ్నేష్, సుమతి విద్యార్థిని విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపైఅవగాహన కల్పిస్తు సోషల్ మీడియాలో గల ఇన్‌స్టాగ్రాం, ఫేస్ బుక్ వంటి వాటిని వాడకూడదని పలు ఉదహరణలతో వివరించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.



సోయా పంటలో పిచ్చి మొక్కలు అరకతో తొలగిస్తున్న రైతులు

వ్యవసాయంలో రైతన్నల బిజీ బిజీ

● వర్షంతో ఊరట ● సోయా, పత్తి పంటలకు జీవం

మద్నూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో అన్నదాతలు బిజీబిజీగా తమ పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత నెల రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరట కలిగించగా పంటలకు ఊపిరి పోసినట్లయింది. ఉమ్మడి మద్నూర్ మండలంలో రైతులు సాగుచేసిన సోయా, పత్తి, కందులు, మినుములు, పెసర, తదితర వాణిజ్య పంటలకు జీవం పోసినట్లయింది. గత కొద్దిరోజులుగా వర్షాలు కురియక ఎండలు మండిపోవడంతో తొలకరి వర్షాలు పులకరించి విత్తిన పత్తి, సోయా విత్తనాలు మొలకెత్తుతాయో లేదోనని కొంతమంది రైతులు మొలకెత్తిన వాణిజ్య పంటల మొక్కలు వాడిపోతాయేమో అని రైతులు ఆందోళన చెందారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షపు జల్లులు ఒక మోస్తారు వర్షాలు, గత మూడు రోజులుగా కురుస్తుండడంతో రైతులకు పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. మొలకెత్తిన వివిధ రకాల పంటల మొక్కలకు వర్షాలు ఊపిరి పోయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్ మొదటి వారంతో వర్షాలు కురయగా దుక్కులు దున్ని విత్తనాలు విత్తుకునే పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. తదుపరి వరుణుడు ముఖం చాటేయడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తుతాయో లేదోనని మొలకెత్తిన మొక్కలు ఎండిపోతాయేమోనని ఆందోళన చెందు తున్న తరుణంలో వర్షం కురుస్తుండడంతో ఈసారి పత్తి, సోయా తదితర పంటలు గట్టెక్కుతాయని రైతులు భావిస్తున్నారు. ఈసారి ఉమ్మడి మద్నూర్ మండలంలో సోయా 35 వేల ఎకరాలు, పత్తి నాలుగు వేల ఎకరాలు, కందులు 5,200 ఎకరాలు, మినుములు 1550 ఎకరాలు, పెసర్లు 1250 ఎకరాలు, వరి 6,200 ఎకరాలలో రైతులు పంటల సాగు చేశారు. అన్నదాతలు ఎన్నో ఆశలతో వేసిన పంటలు ఈసారి అధిక దిగుబడి వస్తాయని ఆశిస్తున్నారు.

రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలి



నవీపేటలో ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాసర ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం నవీపేటలోని బాసర ప్రధాన రహదారికి చెందిన ఇరువైపులా ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా అక్రమంగా షెడ్లు వేయడంతో రోడ్డుపై వాహనాలు నిలుపుతున్నారని దీంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల మండల కేంద్రంలోని బాసర ప్రధాన రహదారిపై తేజశ్విని అనే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్థానిక యువకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినయ్, ఈడీఏఆర్ జిల్లా మేనేజర్ వర్షనిహంత్, ఆర్అండ్‌బీ డీఈ రామ్మోహన్, ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులున్నారు.

ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చివేయాలి



ఫకీరాబాద్ వద్ద ప్రధాన రహదారిపై గుంతలు పడిన దృశ్యం

నవీపేట,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చివేయాలని స్థానికులు కోరారు. బాసర ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయని రహదారిపై భారీ సైజులో గుంతలు పడడంతో రాత్రివేళలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వారు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్



నిజాంసాగర్ బస్ స్టేషన్ ఇదే



సంగారెడ్డి - హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు పిట్లం ఎక్స్ రోడ్డు వద్ద వేచి ఉన్న దృశ్యం



నరసింగరావుపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నిజాంసాగర్ వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

నిజాంసాగర్‌కు ఆర్టీసీ బస్సులు కరువు

● 34 ఏళ్లుగా ప్రయాణికులకు తప్పని తిప్పలు
● పట్టించుకోని పాలకులు, అధికారులు
● ఇదీ నిజాంసాగర్ రవాణా సౌకర్యాల తీరు

నిజాంసాగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనే చందంగా మారింది నిజాంసాగర్ రవాణా సౌకర్యం తీరు. ఎన్నికలు వచ్చాయంటే చాలు ఎన్నికల బరిలో నిలుచున్న అభ్యర్థులు వాగ్దానాలు హామీలు ఇస్తారే తప్ప ఎన్నికలు పూర్తి అయ్యాక నిజాంసాగర్ రవాణా సౌకర్యం గురించి మర్చిపోవడం ప్రజాప్రతినిధుల ఆనవాయితీ. ఆనాడు రాష్ట్ర రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ నిజాంసాగర్‌కు కాలక్రమేనా రవాణా సౌకర్యం ప్రజలకు లేకుండా పోయింది. సంగారెడ్డి, హైదరాబాద్, నారాయణఖేడ్, జోగిపేటలతో పాటు మహారాష్ట్ర కర్ణాటక ప్రాంతాలకు నిజాంసాగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేకపోవడంతో అనేక పాట్లు పడుతూ ఒకటి రెండు చోట్ల బస్సులను మార్చుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. 34 ఏళ్లగా ఈ పరిస్థితి ప్రయాణికులు ఎదుర్కొంటున్న పాలకులు అధికారులు పట్టించుకునే పాపాన పోవడం లేదని మండల వాసులతో పాటు నిజాంసాగర్ బస్ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వాపోతున్నారు. నిజాంసాగర్ నుంచి సంగారెడ్డి హైదరాబాద్ వెళ్లాలనుకుంటే నర్సింగరావుపల్లి కూడలి అయిన పిట్లం చౌరస్తాకు వెళ్లి హైదరాబాద్ సంగారెడ్డి జోగిపేట్‌లకు వెళ్లాల్సి వస్తోంది. నిజాంసాగర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు వెళ్లాలంటే సంగారెడ్డి హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు నరసింగరావు పల్లి చౌరస్తాలో బస్సు దిగి ఆటోలు కోసం పడిగాపులు కాస్తూ నిజాంసాగర్‌కు వెళ్లాల్సి వస్తోంది. నిజాంసాగర్ నుంచి నారాయణఖేడ్ బీదర్ ప్రాంతాలకు వెళ్లాలంటే ఒకటి రెండు మూడు బస్సులు తప్ప వేరే డిపోల బస్సులు ఈ ప్రాంతానికి ని జాంసాగర్ నుంచి వెళ్లాలంటే అనేక పాట్లు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. నిజాంసాగర్ నుంచి జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ ప్రాంతాలకు వెళ్లా లంటే ఇక్కడి ప్రయాణికులు పిట్లం కూడలికి వెళ్లాల్సి వస్తోంది. గతంలో మెదక్, హైదరాబాద్ 2, హైదరాబాద్ 1, సంగారెడ్డి ప్రజ్ఞాపూర్ డిపోలకు చెందిన బస్సులు నిజాంసాగర్ కూడలిని మీదుగానే వెళుతూ ఉండేవి ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కొందరు అధికారులు తప్పుడు నివేదికలు అందజేయడంతో ఈ డిపోల బస్సులను నిజాం సాగర్‌కు రాకుండా రద్దు చేశారు. పిట్లం కూడలి నుంచి రెండు వరుసల రహదారి చూడముచ్చటగా ఉన్నప్పటికీ బస్సులు నడపకపోవడం పట్ల పలువురు ప్రయాణికులు నిరసన వ్యక్తం చేస్తూ ఉన్నారు. ఈ బస్సుల కోసం ప్రయాణికులు ప్రజలు పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యం. ఈ ప్రాంతాలకు నిజాం సాగర్ బస్ స్టేషన్ నుంచి ప్రతిరోజు దాదాపు 1500 మంది ప్రయాణికులు వెళుతూ ఉన్న ఆర్టీసీ అధికారులకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరి స్తున్నారని ఆరోపణలు వినవస్తూ ఉన్నాయి. బాన్సువాడ డిపో అధికారులు గతంలో నిజాంసాగర్ ప్రాజెక్టు మీదుగా అచ్చంపేట, ఆరేపల్లి, బ్రాహ్మణపల్లి, మాసంపల్లి మీదుగా శంకరంపేట నారాయణ ఖేడ్‌లకు బస్సులు నడిపేవారు. కాలక్రమేనా ఐదేళ్ల కిందట ఆర్టీసీ అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం ఈ బస్సులను రద్దు చేశారు. నారాయణ ఖేడ్ డిపో నుంచి ఐదేళ్ల కిందట వేములవాడకు బస్సు సౌకర్యం ఉండేది. ఈ బస్సు సౌకర్యాన్ని కామారెడ్డి వేములవాడ డిపో అధికారులు నారాయణఖేడ్ డిపో బస్సులను వేములవాడకు నడపొద్దని ఆంక్షలు విధించడంతో నారాయణఖేడ్ డిపో అధికారులు బస్సులు రద్దు చేశారు. ప్రయాణికులకు అన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కల్పించడంతో పాటు పల్లె వెలుగు బస్సులను నడుపుతామని ఆర్టీసీ ఉన్నతాధికారులు సమావేశాల్లో చెబుతూ ఉంటారే తప్ప చెప్పిన మాటలను ఆచరణలోనికి పెట్టలేకపోతున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తూ ఉన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రాష్ట్ర రాజధాని లోని ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న నిజాంసాగర్ కూడలి నుంచి సంగారెడ్డి, హైదరాబాద్, నాందేడ్, వేములవాడ, బీదర్, నాందేడ్ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సోయా.. గయా!

● వైరస్ సోకిన సోయాపంట
● పంట ఆరంభంలోనే పట్టి పీడిస్తున్న వైరస్
● పత్తాలేని వ్యవసాయ అధికారులు

మెండోర , జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించే పం టలకు గిట్టుబాటు ధరలేక ఒక వైపు ఈ ఏడాది వర్షాభావ ఏని కారణంతో అన్న దాతలు ఇబ్బందులు ఎదుర్కోవడం ఇంకో వైపు విత్తనం విత్తిన పంటలు మొలక దశలో ఉన్నప్పటికీ చీడ పీడకు అధికంగా సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా భారీ వర్షాలు లేక అన్నదాతలు కుదేలు అవుతున్న పరిస్థితులు ఉండగా చీడ పీడల భారి నుంచి పంటలను రక్షించి అన్నదాతలు అండగా నిలవాల్సిన వ్యవసాయ అధికారులు పట్టలేకుండా పోయారు. నిజామాబాద్ జిల్లాకు చివర మండలం మెండోర మండలం కావడంతో సంబంధిత అధికారులు ఇటువైపు చూడరు. ఇటువైపు రారు అని రైతులపై వ్యవసాయ అధికారులు చిన్న చూపు చూస్తున్నారని రైతులు రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. సోయా పంటకు వైరస్ సోకడంతో



మెండోరాలో వైరస్ సోకడంతో ఆకులు రాలిపోయిన సోయా పంట

వ్యవ సాయ అధికారులు వచ్చి రైతులకు అవగాహన కల్పించి ఏది పిచికారి చేస్తే గట్టేకుతారో చెప్పాలని స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అధికారులకు సమాచారం ఇచ్చిన కాని వ్యవసాయ అధికారులు పంటల వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు రైతులు అంటు న్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లోనే అన్నదాతలకు వ్యవసాయ అధికారుల నుంచి సలహాలు, సూచనలు అవసరం అవుతాయి. అలాంటిది అధికారులు ఎక్కడ కూడా పంటల ను పరిశీలించి సూచనలు ఇచ్చిన పాపాన పోలేదు. సోయా, మొక్క జొన్న, పసుపు పంటలకు వచ్చిన సమస్యల గురించి అధికారులకు విన్నవించుకుందామని రైతు వేదికల దగ్గరికి రైతులు వెళితే ఎప్పుడూ చూసిన రైతు వేదికల తాళాలు దర్శ నమిస్తున్నాయి. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు ప్రభుత్వం అని ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుండగా వ్యవసాయాధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటం ఏమిటని పలువురు రైతులు వాపోతున్నారు.



మెండోర రైతు వేదిక

వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు లేకుంటే ఎలా..

- మగ్గిడి సాయరెడ్డి, రైతు మెండోర



రైతులు పండించిన పంటలకు వైరస్ సోకిన, ఏమైనా సమస్యలు వచ్చిన కానీ అందుబాటులో వ్యవసాయ అధికారులు లేకుంటే రైతులకు సలహాలు, సూచనలు ఎవరు ఇవ్వాలి. సోయా పంటకు ఎప్పుడూ లేని విధంగా కొత్త వైరస్ రావడతో సోయా పంట ఆకులు రాలిపోతున్నాయి. పంట మధ్యలో అక్కడక్కడ ఆకు ఎర్రగా అవుతుంది. సోయా పంట మొదటి దశలో నల్ల ఆకుపచ్చ రంగులో ఉండాల్సిన పంట ఎర్రగా ఉంది. సలహాలు, సూచనలు ఇవాల్సిన అధికారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి వైరస్ సోకిన పంటలకు సలహాలు, సూచనలు ఇవ్వాలి.

నవనాథ సిద్దుల గుట్ట శివాలయంలో ప్రత్యేక పూజలు

పెర్కిట్ , జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై శివాలయంలో సోమవారం అన్నపూర్ణ మాత, శివలింగానికి రంగురంగుల గాజులతో అలంకరించారు. భక్తులు బిల్వ పత్రాలు, పంచా మృతాలతో అభిషేకం చేశారు. రామాలయం ముందు గల ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళ భక్తులకు ఆలయ కమిటీ వారు గాజులను పంపిణీ చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు, ఆర్మూర్ భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తు పాటలు పాడారు. ఇకపై వీచేసిన భక్తులు ఆలయ కమిటీ వారు అందించే అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, ప్రశాంత్ గౌడ్, హజారీ సతీష్, అలిశెట్టి నరేష్, ఆలయ అర్చకులు కుమార శర్మ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



అన్నపూర్ణమాత, శివ లింగానికి గాజులతో అలంకరించిన దృశ్యం

'ఆంధ్రజ్యోతి' పరిశీలన



ఇందల్వాయి ఎంపీడీవో కార్యాలయం



ప్రభుత్వ స్థలం



తహశీల్దార్ కార్యాలయం

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

● ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేక ఇక్కట్లు ● ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు

ఇందల్వాయి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొన్ని నూతన జిల్లాలు, నూతన మండలాలు ఏర్పడ్డాయి. అందులో భాగంగానే ఇందల్వాయి మండలం నూతనంగా ఏర్పడింది. నూతన మండలం ఏర్పడి పదేళ్ల గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ప్రస్తుతం అద్దె భవనాల్లో తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, రిసోర్స్ భవనం, ఇందిరాక్రాంతి భవనం, పోలీస్ స్టేషన్ లాంటి ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతు న్నాయి. ప్రభుత్వం సరైన సమయానికి అద్దె బిల్లులు చెల్లించకపోవడం తో ఇంటి యజమానులు ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేసిన సందర్భాలు ఉన్నాయి. అద్దె బిల్లు ఎక్కువ కావడంతో కొన్ని నెలల క్రితం తహశీల్దార్ కార్యాలయాన్ని ఇంకో చోటికి మార్చారు.

తహసీల్దార్ కార్యాలయం..

ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం ఇందల్వాయి ప్రాథమిక సహకార సంఘం మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్నారు. తహశీల్దార్ కార్యాలయం మార్చి నెలలు గడుస్తున్నా గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. సొసైటీ మొదటి అంతస్తులో తహశీల్దార్ కార్యాలయం నిర్వహించడంతో వివిధ పనుల కోసం వస్తున్న వృద్ధులు, వికలాంగులు మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు.

● మండల పరిషత్ కార్యాలయం..

మండల పరిషత్ కార్యాలయం బస్టాండ్ నుంచి ఒక కిలోమీటరు దూరంలో అద్దె భవనంలో ఉండటంతో వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు కిలోమీటరు దూరం సైతం కాలినడకన నడవాల్సి వస్తుంది. పిల్లలు, వృద్ధులు, వికలాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ కేసుల కోసం, వ్యక్తిగత సమస్యల కోసం, భూతగాదాల సమస్యల కోసం చెప్పుకోవడానికి వస్తున్న మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో ఊరు చివరన అద్దె భవనంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇందిరా క్రాంతి భవనం, మండల రిసోర్స్ భవనాన్ని అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఏళ్ల గడుస్తున్నా నిధుల లేమితో నూతన భవనాలు నిర్మించడం లేదు.

● స్థలం ఉన్నా నిధులు సున్నా

మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి సర్వే నెంబర్ 787 అసైన్డ్ భూమిని కేటాయించారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు అనువైన స్థలం ఉన్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అద్దె భవనాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● నూతన భవనాలు నిర్మించాలి..

బడుగు రాజు, తిర్మన్‌పల్లి



ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ నిధులు లేక ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించడం లేదు. మండలం ఏర్పడి ఏళ్ల గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల పైన ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు.

● ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుంది..

షేక్ హైమద్, తిర్మన్‌పల్లి



సర్వే నెంబర్ 787లో ఏడు ఎకరాల అసైన్డ్‌భూమి ఉంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రభుత్వ స్థలం కబ్జాలకు గురవుతుంది. అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాలి.

షూటింగ్‌లో బంగారు పతకం సాధించిన విద్యార్థి రుషికేశ్



ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

రుద్రూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబం(ఆర్) గ్రామ ఆదర్శ పాఠశాల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో భాగంగా పాఠశాల నుంచి 10మంది విద్యార్థులు జానకంపేటలో నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థి రుషికేష్ షూటింగ్‌లో బంగారు పతకం సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్ప, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

‘ప్రజావాణి’కి 126 వినతులు

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఈవారం 126 వినతులు వచ్చాయి. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్‌డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, మెప్మా పీడీ రాజేందర్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డిలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇస్తూ త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

గాంధీగంజ్ గేటును తెరిపించాలని వినతి..

నగరంలోని గాంధీగంజ్‌లో గేట్లను మూసివేయడం వల్ల తాము వ్యాపారాలు నష్టపోతున్నామని ది గాంధీగంజ్ బిల్డింగ్ ఓనర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. 1905 నుంచి ఉన్న గాంధీ గంజ్‌లో తాము అనేక సంవత్సరాలుగా వ్యాపారాలు నిర్వహిస్తున్నామని గేటును మూసివేయడం వల్ల తమ వ్యాపారాలు సక్రమంగా నడవక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. వెంటనే గేటును తెరవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు కమల్ కిశోర్ ఇనాని, చంద్రశేఖర్, పార్తిరామవేంద్ర, లక్ష్మీకాంత్, తదితరులు ఉన్నారు.

జోగిని, ఒంటరి మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

అంబం, ఎడపల్లిలో ఉన్న జోగిని, ఒంటరి మహిళలకు గతంలో ఆశానగర్ కాలనీలో ఇళ్ల నిర్మాణం చేశారని అవి పూర్తిగా కూలిపోయాయని ప్రస్తుతం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తున్న క్రమంలో వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సబ్బునిలత ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీ ఉద్యోగుల వేతనాలు ఇవ్వాలి

కొత్తగా నియామకమైన కేజీబీవీ నాన్‌టీచింగ్, వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని కోరుతూ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం నియమించబడిన సిబ్బందికి అదే విధంగా ఐదు నెలల నుంచి కొంత మంది సిబ్బందికి వేతనాలు రావడం లేదని వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలు, సబ్బులు, కొబ్బరినూనె, గ్లౌజులు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు సమస్యలపై మెమోరాండం ఇచ్చారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడం లేదని వెంటనే కనీస వేతనం 26వేలు ఇవ్వాలని కోరారు.

కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించాలి

తాను గతంలో బోధన్ రెవెన్యూ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసి భూభారతి కార్యక్రమం ఆగిపోవడంతో తనను తొలగించారని కలెక్టర్ ఆదేశాలతో బోధన్ తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్నట్లు చెప్పారని కానీ రెండేళ్లుగా తనను నియమించడం లేదని బోధన్‌కు చెందిన రాహుల్ కలెక్టరేట్‌కు వచ్చాడు. కానీ ఇటీవల ఓ మహిళను కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించుకున్నారని తనకు అన్యాయం జరిగిందని తన కుటుంబం తనపైనే ఆధారపడి ఉన్నందున తనకు న్యాయం చేయాలని కోరారు.


ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో సోమవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నాచౌక్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సుమారు 8వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్కగణేష్, జిల్లా అధ్యక్షుడు నరేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు అందజేత


నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థి

ధర్పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీలో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు పూర్వవిద్యార్థి మూత రాజ్‌కుమార్ నగదును అందజేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 2001-02లో ఎస్సెస్సీ పూర్తి చేసి ప్రభుత్వం హైదరాబాద్ కంటోన్‌మెంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రాజ్‌కుమార్ 2024-25 ఎస్సెస్సీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరికి నగదును అందజేశారు. ఈ సందర్భంగా మాలావత్ నరేష్, లౌడ్య కళ్యాణ్‌లకు రూ.5వేలు, రూ.3వేల చొప్పున అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రాజ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎందరో పూర్వవిద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని అందులో తాను ఒకడినని రాజ్‌కుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరుతేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

నిజామాబాద్ కల్చరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం రైతు కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా ఈనెల 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి దేవరాం పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశాన్ని పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించి వ్యవసాయ రంగాన్ని, పరిశ్రమలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సురేష్, బాబన్న, రాజన్న, నర్సయ్య, దామోదర్, కిషన్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

జీవో 282 రద్దు చేయాలని దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ కల్చరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ విడుదల చేసిన జీవో నంబర్ 282ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద జేఏసీ నాయకులు ఊరేగింపుగా వచ్చి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక జేఏసీ నాయకులు సాయన్న, రాములు, రవి, ఇమ్రాన్ అలీ, ప్రసాద్, కిరణ్, సురేష్, నవీన్, లక్ష్మి, సాయిలు, నర్సయ్య, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్:దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో కార్మిక సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యత చూపాలని సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు పెద్దివెంకట్రాములు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో పలుయూనియన్ నాయకులకు, కార్మికులకు ఈనెల 9న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ఒక్కరోజు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎం జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తూ దొరికిన బాలుడు

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):నగరంలోని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని విక్రయిస్తూ మైనర్ బాలుడు పట్టుబడ్డాడు. సోమవారం నగరంలోని ఎల్లమ్మగుట్ట బ్రిడ్జి ప్రాంతంలో ఓ మైనర్ బాలుడు గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో నాల్గవ టౌన్ పోలీసులు అతడిని తనిఖీ చేయగా 66 గ్రాముల గంజాయి దొరికింది. మైనర్ బాలుడు వద్ద గంజాయి దొరకడం నగరంలో గంజాయి ఏ విధంగా విస్తరిస్తుందో, పిల్లలు ఏ విధంగా బానిస అవుతున్నారో అర్థమవుతుంది. చిన్న పిల్లలను గంజాయి విక్రయించేందుకు ఎవరైనా ఉపయోగిస్తున్నారా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. గంజాయి విక్రయిస్తున్న బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నేడు బడిబాటకు ఆర్టీసీ బస్సులు వేయాలని ధర్నా

సుభాష్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):బడిబాటకు విద్యార్థులు రావాలంటే ఆర్టీసీ బస్సులు ఫ్రీగా వేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో సోమవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడిబాటలో విద్యార్థులు ఎక్కువగా రావాలంటే ఆర్టీసీ బస్సులను ప్రభుత్వ పాఠశాలలన్నింటికి కేటాయించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మహిపాల్, జేఏసీ నాయకులు సాగర్, ప్రశాంత్, రాజేశ్వర్, లింగ స్వామి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్ షిప్ విడుదల చేయాలని అర్ధనగ్న ప్రదర్శన

ఆర్మూర్‌టౌన్ , జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అఖిల భారత ప్రగతి శీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న 7500 కోట్లకు పైగా స్కాలర్ షిప్, ఫీజ్ రియాంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐపీఎస్‌యు జిల్లా కార్యదర్శి బోడ అనిల్, డివిజన్ సెక్రటరీ గోపాల్ సీన్ ఠాకుర్, నాయకులు శివ, గణేష్, సూర్యపాల్, తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నర్సింహా రెడ్డి

నిజామాబాద్ లీగల్ జూలై 7:మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నర్సింహారెడ్డిని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీచేశారు నిజామాబాద్ జిల్లా సీనియర్ న్యాయవాది ఈయన 1983 నుంచి ప్రాక్టీస్ చేస్తున్నారు క్రిమినల్ కేసులలో పోలీస్ వారి తరుపున కేసుని వాదించటానికి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్త, జిల్లా న్యాయవాది అయినా గాంధారి నర్సింహారెడ్డికి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉత్తర్వులు జారీచేశారు.ఈ సందర్భంగా సోమవారం నాడు జిల్లా ప్రధాన న్యాయాధికారిణి జీవీఎన్ భరతలక్ష్మి పుష్ప గుచ్చం అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అధ్యక్షుడు మామిళ్ళ సాయిరెడ్డి, సుదర్శన్, కార్యదర్శి మాణిక్ రాజు పాల్గొన్నారు

ఓటరు నమోదుకు బీఎల్‌వోలకు అవగాహన సదస్సు

ఇందల్వాయి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్‌స్థాయి అధికారులకు ఒక్కరోజు అవగాహన సదస్సును ఆర్‌డీవో రాజేంద్రకుమార్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటరు కార్డు నమోదు, చనిపోయిన వ్యక్తుల తొలగింపు, మార్పులు, చేర్పులు, ఎస్ఆర్‌ఐల ఓటరు కార్డు నమోదు ప్రక్రియను బూత్‌స్థాయి అధికారులకు వివరించారు. ఓటరు కార్డులో తప్పులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రాజేంద్రకుమార్, ఎంఆర్‌వో వెంకట్రావు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీయూలో హెటిరో పార్మాకంపని ఉద్యోగాల భర్తీ

డిచ్‌పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ లో కెమిస్ట్రీ విభాగం, గ్లోబల్ పార్మాసుటికల్ కంపనీ హెటరో సంయుక్తంగా ఈ నెల 9న ఉద్యోగ భర్తీకి, రాత, మౌఖిక పరీక్ష నిర్వహించి అర్హులైన వారి కి నియామక పత్రాలు అందజేస్తారని కెమిస్ట్రీ విభాగాధిపతి డా.సాయిలు తెలిపారు. వర్సిటీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారితో పాటు ఈ ఏడాది ఫైనల్ ఇయర్ వారు ఈ ఉద్యోగ అవకాశాలకు హాజరుకావచ్చునని ఆయన సాయిలు తెలిపారు.

గుమస్తా సంఘం అధ్యక్షుడిగా బాల్ అంజయ్య

మోపాల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో గుమస్తా సంఘం ఎన్నికలు సోమవారం హోరా హోరీగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా లాండేరి బాల్ అంజయ్య విజయం సాధించారు. ప్రత్యర్థి అభ్యర్థి నర్సయ్య మీద 134 ఓట్ల తేడాతో గెలుపొందారు. గతంలో కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లనుపంచిపెట్టారు. కార్యదర్శిగా గట్లశ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా వెంకటి విజయం సాధించారు.

అడవి పంది ఢీకొని వ్యక్తి మృతి

రెంజల్,జూలై7(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల కేంద్రంలోని సూర్య ఫామ్ వద్ద అడవి పంది ఢీకొని బుడ్డోళ్ల గంగాసాగర్(27)అనే వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెగడాపల్లి గ్రామానికి చెందిన బుడ్డోళ్ల గంగాసాగర్ బోధన్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తుండేవాడని, ఉద్యోగ పని నిమిత్తం నిజామాబాద్ వెళ్లి తిరిగి రాగా రెంజల్ శివారులోని సూర్యఫామ్ వద్ద అడవి పంది ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతుడు గంగాసాగర్‌కు సంవత్సరం క్రితమే వివాహం అయిందని వారన్నారు.

వాహనాల్లో చెత్తను తక్కువగా తెస్తే రిటర్న్ చేయండి

● డిప్యూటీ కమిషనర్ రవిబాబు

సుభాష్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):చెత్తను తరలించే వాహనాలు డంపింగ్ యార్డుకు చెత్తను తక్కువగా తెస్తే రిటర్న్ చేయాలని డిప్యూటీ కమీషనర్ రవిబాబు డంపింగ్ యార్డు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని నాగారంలోగల డంపింగ్ యార్డును సోమవారం ఆయన పరిశీలించారు. వర్మి కంపోస్ట్ పనితీరును పరిశీలించారు. పనితీరు ఇంకా మెరుగుపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌పెక్టర్ ప్రభుదాస్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సం

సిరికొండ జులై 7 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు,నాయకులు జండాను ఎగురవేశారు. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కేక్‌లు కట్ చేశారు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొట్టల దీపక్, చలపతి, రాజేందర్, సిరికొండలో జరిగిన కార్యక్రమంలో సంపత్, గణేష్, రాజేందర్, రంజిత్, రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు నాంపల్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో మందకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. వెంట జిల్లా ఉద్యోగుల సంఘం నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్:మాదిగల వర్గీకరణ కలను సహకారం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నుడా ఛైర్మన్ కేశవేణు అన్నారు. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో ఎంఆర్‌పీఎస్ నగర కమిటీ అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రివర్గ వస్తరణలో మాదిగ సామాజిక వర్గ నాయకులకు చోటు కల్పించి మాదిగలను హక్కున చేర్చుకున్నారని అన్నారు. సామాజిక ఫలాలు అణగారిన వర్గాలకు అందినప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. మాదిగలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంటకాంగ్రెస్ నాయకులు పార్థసారధి, కొండపాక రాజేష్, మల్యాల గోవర్ధన్, కృష్ణ, మోహన్, సుధాకర్, పోసాని, సామేల్, చిరు, కవిత,గంగామణి, సాయికుమార్, బాబురావు, పాల్గొన్నారు.

సుభాష్‌నగర్:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న విధులు బహిష్కరిస్తున్నట్లు విద్యుత్ జేఏసీ ఛైర్మన్ రఘునందన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పవర్ హౌజ్ కార్యాలయంలో సోమవారం పని బహిష్కరణ నోటీసు ఎస్ఈ రవీంధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జాక్ సమావేశంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 9వ తేదీన ఒక్కరోజు విధుల బహిష్కరణ చేయాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏవో శ్రీనివాస్, జేఏసీ కోఛైర్మన్ పి.గంగాధర్, కన్వీనర్ బాలేష్ కుమార్, కోకన్వీనర్ తోట రాజశేఖర్, 1104 జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

రెంజల్,జూలై7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ యాక్టివిటీస్‌తో పాటు వర్క్ షాప్‌పై ప్రత్యేక సలహా, సూచనలు చేశారు. తరగతి విద్యార్థులకు నోట్ బుక్‌లతో పాటు ఆన్‌లైన్‌లకు సంబంధించిన విషయాల గురించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీలా కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఇల్తెపు శంకర్, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, వెంకట లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● గ్రామస్తులకు వైద్యాధికారులు, మండల స్థాయి అధికారుల అవగాహన

మోపాల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బంది, మండల స్థాయి అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గ్రామస్తులకు సోమవారం అధికారులు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో డెంగ్యూ, విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, డాక్టర్ కె.ప్రత్యూష, సీహెచ్‌వో, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దుబాయిలో పెద్దవాల్గోట్ వ్యక్తి మృతి

సిరికొండ జులై 7 (ఆంధ్రజ్యోతి) : సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన వడియాల రవీందర్(38) అనే యువకుడు ఈ నెల 4న గుండె పోటుతో మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లిన వడియాల రవీందర్ కొద్ది సంవత్సరాల క్రితం దుబాయి వెళ్లాడు.సెలవులో గత ఏడాది పెద్దవాల్గోట్ గ్రామానికి వచ్చివెళ్లాడు. రోజులాగే డ్యూటీకి వెళ్లి రూమ్‌కు వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న రవీందర్ ఒక్కసారిగా గుండె పోటు రావడంతో గదిలో ఉన్న స్నేహితులు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు.కుటుంబ యజమాని ఆకస్మికంగా చనిపోవడంతో భార్య లావణ్య ఇద్దరు పిల్లలు దుఃఖసాగరంలో మునిగి పోయారు. తెలంగాణ ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని కుటుంబీకులు,గ్రామస్తులు కోరుతున్నారు.మృతిని భార్య పిల్లలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే బదిలీ

● పోలీస్ శాఖలో వింతఘటన

సిరికొండ జూలై 7 (ఆంధ్రజ్యోతి) సిరికొండ ఎస్సై మామిడి కళ్యాణి బాధ్యతలు చేపట్టిన ఒక్కరోజులోనే బదిలీఅయ్యారు. ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు సీపీ ఆదివారం పోస్టింగ్‌లు ఇచ్చారు.ఇందులో భాగంగానే సిరికొండ ఎస్సైగా కళ్యాణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కానీ సిరికొండ మారుమూల గ్రామం కావడంతో ఆమెను సోమవారం ధర్పల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సిరికొండ ఎస్సైగా రామకృష్ణ నియామకం అయ్యారు.రామకృష్ణ ధర్పల్లి ఎస్సైగా పనిచేస్తున్నారు.


వినతులు స్వీకరిస్తున్న పోలీసు కమిషనర్ సాయిచైతన్య

పోలీసు ప్రజావాణికి 27 ఫిర్యాదులు

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి సోమవారం సీపీ సాయిచైతన్య ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సీపీ ఫిర్యాదుదారుల సమస్యలు విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం 27 ఫిర్యాదులు స్వీకరించారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల యొక్క ఎస్సై, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కరించడానికి సూచనలు చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకుంటూ వారి సమస్యలను చట్టప్రకారం పరిష్కరించుకునేలా పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా ముందుకు సాగడమే జిల్లా పోలీసు శాఖ లక్ష్యం అని సీపీ సాయిచైతన్య తెలిపారు.

చెక్కులను పంపిణీ చేసిన గడుగు గంగాధర్


చెక్కులను పంపిణీ చేస్తున్న గడుగు గంగాధర్

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తనోత్పత్తి - పంట నష్టపరిహార పంపిణీ కార్యక్రమంలో సోమవారం రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పాల్గొని వాజేడు మండలంలో మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు చెక్కులు అందజేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క సొంత నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర రైతు కమీషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై కమిషనర్ దిలీప్‌కుమార్ సమీక్ష


మాట్లాడుతున్న కమిషనర్, హాజరైన అధికారులు

సుభాష్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్లపై నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని వార్డు అధికారులు ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులను పక్కాగా అమలు చేయాలన్నారు. ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా నిర్దేశించిన సమయాల్లో పనులు పూర్తి చేయాలని వార్డు అధికారులను కోరారు. అన్ని శాఖల అధికారులు, వార్డు అధికారుల కార్యకలాపాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. సంబంధిత వార్డు అధికారులతో సమన్వయంతో ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఏఎస్సైలకు పదోన్నతులు

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఏఎస్సైలకు పదోన్నతులు వచ్చాయి. ఈ మేరకు సీపీసాయి చైతన్య సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ముగ్గురు ఏఎస్సైలకు సబ్ ఇన్స్‌క్టర్‌లుగా పదోన్నతులు కల్పించారు. బోధన్ రూరల్ పీఎస్‌లో పనిచేస్తున్న నాగభూషణానికి ఎఎస్సైగా ప్రమోషన్ కల్పించి నిర్మల్ జిల్లా బదిలీ చేశారు. మాక్లూర్ ఠాణాలో పని చేస్తున్న పి నర్సయ్యను నిర్మల్ జిల్లాలో పని చేస్తున్న పి నర్సయ్యను నిర్మల్‌కు పదోన్నతిపై పంపించారు. నిజామాబాద్ త్రీటౌన్ ఏఎస్సైగా బీ.లీలాకృష్ణకు ఏఎస్సైగా ప్రమోషన్ ఇచ్చి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఇటీవల హెచ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైలుగ ఆ పదోన్నతి పొందిన తొమ్మిది మందికి తాజాగా సీపీ కమిషనరేట్ పరిధిలో పోస్టింగ్‌లు ఇచ్చారు. హెచ్ కానిస్టేబుళ్ళ, వసంత్‌రావు,కె. అరుణకుమాం అను రాధ, జీవీ రమణేశ్వరి, ముంజాజ్‌బేగం, సతీష్‌కుమార్‌లకు ఏఎస్సైలుగా పదోన్నతులు పొందారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.210	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	: రూ.220	రూ.270	రూ. 290

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,700	రూ.90,100	రూ.1100

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మెట్రో ఇన్ డినో (హిందీ) (10.10)
: సోలో బాయ్ (1.35)
: తమ్ముడు (4.25, 7.35, 10.45)
స్క్రీన్-2 : షో టైమ్ (10.05)
: కుబేరా (12.30, 4.10, 7.50, 10.40)
స్క్రీన్-3 : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (10.10, 1.00)
: కన్నప్ప (3.50, 10.45)
: ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (7.30)
స్క్రీన్-4 : ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (10.20)
: 3బిహెచ్‌కె (1.35, 7.55)
: సితారే జమీన్ పర్ (హిందీ) (4.30)
: మెట్రో ఇన్ డినో (హిందీ) (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తమ్ముడు (1.40, 7.20, 10.20)
: 3బిహెచ్‌కె (4.35)
స్క్రీన్-2 : జురాసిక్ వరల్డ్ (తెలుగు 3డి) (11.00, 4.40, 10.30)
: కుబేరా (1.30, 7.20)
స్క్రీన్-3 : 3బిహెచ్‌కె (10.45, 7.40)
: కన్నప్ప (1.25, 10.35)
: కుబేరా (4.30)

దేవి : కన్నప్ప (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కుబేరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: తమ్ముడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్